కథ

# సజీవ కళాఖండం

బులుసు.జీ.ప్రకాష్

**మొదటి మేరేజ్ డే జరుపుకున్న వింధ్యావళి, బలి చక్రవర్తి దంపతులు ఒక పెద్ద నర్సింగ్ హోమ్‌కి వచ్చారు. ఫలానా గైనకాలజిస్టుగా రున్నారా అని భోగట్టా చేశారు. ఆయ నున్నారు...లక్కీయే!**

ఆయనకు దంపతు లిద్దరూ కలిసి విన్నవించారు. "డాక్టరుగారూ! ఈమె నా మిసెస్ వింధ్యావళి. మాకు మేరేజ్ అయి సంవత్సరం అయింది. ప్రస్తుతం ఈమె మూడు నెలలనుంచి రెగ్యులర్‌గా మెన్సస్ అవడం లేదు. ఓమారు మీరు పరీక్షించాలి."

డాక్టరుగారు వింధ్యావళిని లోనికి తీసుకెళ్లి పరీక్షలు జరిపారు. ఆమె గర్భవతి అని నిర్ధారణ చేశారు. బిడ్డ ఎదుగుదలకు కావలసిన మాత్రలు, టానిక్కులు రాసి, రెణ్నెల్లు పోయాక మరొకసారి కనబడమని సలహా చెప్పారు.

"థాంక్సు, డాక్టరుగారూ, సెలవు" అన్నా రుభయులూ.

"వెల్‌కమ్" అన్నారు డాక్టరుగారు.

***

రెండు నెలలు అయాక వింధ్యావళి, బలి చక్రవర్తి దంపతులు మళ్లీ డాక్టరుగారిని కలిశారు. డాక్టరుగారు పరీక్షించి బిడ్డ ఎదుగుదల బావుందని చెప్పి, ప్రసవం అయేవరకూ ఏమేమి చేయాలో సూచన లిచ్చి, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి, వాడవలసిన మందులు రాశారు.

"డాక్టరుగారూ..." అని నసుగుతూ అన్నాడు బలి.

"ఎస్ ప్లీజ్."

"చిన్న రిక్వెస్టు..."

"చెప్పండి."

"నా మిసెస్‌కి సెక్స్ డిటర్మినేషన్ టెస్టు..." అనగానే....


"సారీ...అదిమాత్రం చేయకూడదు. ప్రభుత్వం నిషేధించింది. చేయించుకున్నవారూ, చేసినవారూ కూడా శిక్షార్హులు." చెప్పారు డాక్టరుగారు.

"చేసినట్టు మీకూ, మాకూ తప్ప ఇంకెవరికీ తెలియదు...ప్లీజ్ డాక్టర్" అంటూ ఓ పదివేలు డాక్టరుగారి టేబులుమీద పెట్టాడు.

"సరే...టెస్టు చేస్తాను. కాని, డబ్బు పుచ్చుకోను. డబ్బు వెనక్కి తీసేసుకోండి."

"థాంక్స్, డాక్టర్!"

"వెల్‌కమ్" అంటూ, "అమ్మా! మీరు లోనికి పదండి..." అన్నారు డాక్టర్‌గారు.



బలిచక్రవర్తి భార్యను అనుసరించబోయారు.

"సారీ...మీరు రాకూడదు" అన్నారు డాక్టర్‌గారు.

బలి వెనక్కి తగ్గక తప్పిందికాదు.

"నాల్రోజులు పోయాక రండి...ఫలితాలు చెబుతాను" అన్నారు డాక్టరుగారు.

దంపతు లిద్దరూ నిష్క్రమించారు.

నాలుగు రోజులు పోయాక వారిద్దరూ మళ్లీ నర్సింగ్ హోమ్‌లోనికి వచ్చారు.

డాక్టరుగారు ఇద్దర్నీ సాదరంగా ఆహ్వానించి నెమ్మదిగా అన్నారు..."మగబిడ్డ" అని.

"యురేకా!" అని బిగ్గరగా అరిచాడు బలిచక్రవర్తి.

"ఏంటిది...మనిల్లనుకున్నారా? ఇది నర్సింగ్ హోమ్." వింధ్యావళి వారించింది.

"థాంక్యూ డాక్టర్, థాంక్యూ" అని గట్టిగా డాక్టరుగారి చేతు లూపి, మళ్లీ డబ్బు ఇవ్వబోయాడు బలి.

"నో గిఫ్ట్ ప్లీజ్...మీరు వెళ్లొచ్చు" అన్నారు డాక్టర్‌గారు.

బలిచక్రవర్తి తన అత్తమామలకి ఈ శుభవార్త చెబుతూ, "కాని, ఈ విషయం మీ రెవరితోనూ చెప్పకూడదు...గోప్యంగానే ఉంచాలి. లేకపోతే శిక్షకు గురి అవుతాము" అన్నాడు.

"అలాగే" అన్నారు వారు.

***

తెలుగువాళ్ల సంప్రదాయం ప్రకారం మొదటి రెండు పురుళ్లూ పుట్టింటివారే పోయించాలి. వింధ్యావళి తల్లిదండ్రులు అదే నర్సింగ్ హోమ్‌లోని డాక్టరుగారిని కలిసి, తమ కుమార్తెకు ప్రసవంకూడా ఆ నర్సింగ్ హోమ్‌లోనే ఏర్పాటు చేయమని చెప్పారు. డాక్టరుగారు 'అలాగే' అన్నారు.

వింధ్యావళి పుట్టింట్లో ఉంది. ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తెకు ఏడో నెలలో

గాజులు పెట్టించి, పేరంటాళ్లను పిలిచి ఘనంగా ఉత్సవం జరిపారు.

కాలచక్రం తిరిగిపోతూంది. దానికి బ్రేకులు వేయడం ఎవరితరం?

తొమ్మిది నెలలూ నిండిపోయాయి.

రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ (100-44 బి.సి.) జన్మించినప్పుడు అతని తల్లి గర్భాన్ని కోసి, అతన్ని బయటకు తీశారట. అప్పట్నుంచీ జూలియస్ సీజర్ పేరుమీద 'సీజరియన్ ఆపరేషన్' అనే పదం వాడుకలో కొచ్చిందట. అటువంటి సీజరియన్ ఆపరేషన్ అవసరం లేకుండానే, బలి చక్రవర్తి భార్య వింధ్యావళికి సుఖప్రసవం జరిగింది. ఎటువంటి కాంప్లికేషన్లూ లేవు.

అయితే ఆమె ప్రసవించింది 'ఆడ' శిశువుని!

వింధ్యావళీ, ఆమె తల్లిదండ్రులూ ఎంతగానో సంతోషించారు.

ఇంటి పురోహితుణ్ని పిలిపించి జాతకచక్రం వేయించారు. భేషైన జాతకం! ఎటువంటి శాంతులూ చేయనవసరం లేదు.

ఈ శుభ సమాచారాన్ని వింధ్యావళి తల్లిదండ్రులు వియ్యాల వారికి తెలియజేశారు. వాళ్లు పరమానంద భరితు లయ్యారు. తొలుతనే ఇంట్లో మహాలక్ష్మి పుట్టిందని పొంగిపోయారు. అయితే వాళ్ల పుత్రరత్నం బలిచక్రవర్తి మాత్రం కుంగిపోయాడు. సెక్స్ నిర్ధారణచేసిన డాక్టర్ని లోలోన తిట్టుకున్నాడు. ఇంత అబద్ధాలకోరు ప్రపంచంలో ఉండడనుకున్నాడు.

ఇరవై తొమ్మిదో రోజున మనవరాల్ని ఉయ్యాలలో వేసి బారసాల చేస్తున్నాం...ఆ కార్యక్రమానికి రావలసిందిగా వింధ్యావళి తల్లిదండ్రులు వియ్యాలవారిని ఆహ్వానించారు.

ఈలోగా ఎవరికీ చెప్పా చెయ్యకుండా, నర్సింగ్ హోమ్ డాక్టర్ గార్ని కలిసి అతని ప్రయివేట్ రూమ్‌లో గట్టిగా కాకపోయినా మెల్లమెల్లగా తిట్టబోయాడు బలిచక్రవర్తి.

"చూడు, మిస్టర్ బలీ, నేను మీ మిసెస్‌కి అసలు సెక్స్ డిటర్మినేషన్ టెస్టు చెయ్యనే లేదు. ఆడపిల్ల అని తెలిస్తే మీరు ప్రెగ్నన్సీ టెర్మినేట్ చేయమంటారు. అందుకే అలా అబద్ధమాడాను. ఆఫ్ఘనిస్థాన్‌లో ఛాందసులైన తాలిబన్లు, తమ దేశ సంస్కృతీ సంపదలకు అద్దం పట్టే బుద్ధుని విగ్రహ కళాఖండాలను నాశనం చేయడంతో సమానం మీరు చెప్పింది నేను చేస్తే!" అన్నారు డాక్టర్ గారు.



"అదేంటి ఆ పోలిక...తుంటి మీద కొడితే పళ్లు రాలినట్లు!" అన్నాడు బలిచక్రవర్తి.

"అదే చెప్పబోతున్నాను. ఒక శిల్పి ఒక బండరాయిని తీసుకొని చెక్కుతూ చెక్కుతూ నింపాదిగా ముక్కూ చెవులూ, కళ్లూ నోరూ, చేతులూ కాళ్లూ....ఇలా సకల అవయవాలూ సృష్టించినట్లుగా ఒక తల్లి తన గర్భంలోని పరమాణువంత బీజాన్ని భద్రపరచి, నింపాదిగా సకల అవయవాలూ తొమ్మిది నెలల్లో పూర్తిచేసి, శిల్పివలె ఒక మానవాకృతికి రూపకల్పన చేస్తుందే! అటువంటి మాతృమూర్తి తన గర్భ విచ్ఛిత్తికి గురి అయితే ఆ 'సజీవ కళాఖండం' నిర్జీవం అయిపోదా? స్త్రీ లేకపోతే సృష్టికార్యం ఎలా జరుగుతుంది? మగవారిని మగవారు, ఆడవారిని ఆడవారూ ప్రసవిస్తే పరిస్థితి ఎలా ఉండేదో! మనుషు లందరూకూడా స్త్రీ గర్భంలోంచే కదా ఆవిర్భవిస్తున్నారు? అటువంటి సజీవ కళాఖండాల్ని తాలిబాన్ల వలె నన్ను నాశనం చేయమంటారా?" అన్నారు డాక్టరుగారు.

ఇహ గత్యంతరం లేక తిరుగుముఖం పట్టాడు బలి. మొహమంతా విచారం అలుముకుపోయింది. భవిష్యత్ అంధకారంలా తోచింది.

ఇరవై తొమ్మిదోనాడు తల్లిదండ్రులతో తన బిడ్డకి బారసాల ప్లస్ ఉయ్యాలలో వేసే కార్యక్రమానికి వెళ్లక తప్పింది కాదు బలిచక్రవర్తికి.

తన భార్య ఒడిలోనే శిశువుని చూశాడు. శిశువు బోసినవ్వు నవ్వింది. ఆ నవ్వులో ఎంతో అమాయకత్వం చూశాడు బలి. తన ఆగ్రహం అంతా పటాపంచ లయిపోయింది! తన బిడ్డని ఒడిలోకి లాక్కున్నాడు. బిడ్డ బోసి నవ్వులు నవ్వుతూనే వుంది.

'మా పాపాయి బోసినవ్వులే మంచి ముత్యముల వానలు' అని మహాకవి శ్రీశ్రీ రాసింది నమ్ము అవుతుందా?

తనకు సెక్స్ నిర్ధారణ చేసే పరీక్ష చేయకుండా తన కోరికపై అబద్ధ మాడినందుకు మనస్సులోనే వింధ్యావళి ప్రణుతు లిడింది డాక్టర్ గారికి.

ఇంతలో గెజిటెడ్ ఆఫీసర్‌గా ప్రమోషన్ వచ్చినట్లు బలిచక్రవర్తికి ఆర్డర్స్ వచ్చాయి. 'ఓహో! ఈ చిన్నిపాప తనకు ప్రమోషన్ కూడా ఇప్పించిందే!' అని పొంగిపోయాడు బలి.

## పాపం ప్రేమపక్షులు!

అభిషేక్‌బచ్చన్, కరిష్మాకపూర్ల నిశ్చితార్థం రద్దైపోయాక, పాపం ఆ ఇద్దరూ గాయపడిన హృదయాలతో, భగ్నప్రేమతో చెప్పలేని బాధ పడుతున్నారట. లోలో (కరిష్మ ముద్దు పేరు) అండర్ గ్రౌండ్‌కు వెళ్లిపోయింది కనుక, ఆమెను గురించిన వార్తలేవీ వినపడటంలేదు. అభి పెళ్లి జరగదని తెలిసిన రెండు వారాలకు లారాదత్తాతో ఏదో సినిమా తాలూకు షూటింగులకు జైసల్మీర్ వెళ్లాడు. పని చేస్తున్నప్పుడేమో కానీ, కాస్త సమయం దొరికితే మాత్రం దీనవదనంతో, చాలా బాధతో కనిపిస్తున్నాట్ట. అభి కోలుకోవటానికి చాలా సమయమే పట్టేలాగుంది!

ఎన్.

